# నరము - శిక్ష

ఆఫీసు వదలగానే రోజూలా శివరావు సిటీ బస్ కోసం పరుగులు తియ్యలేదు. నిదానంగా నడవటం ప్రారంభించాడు. ఎంచేతనంటే నెలాఖరు రోజులు. జేబులో రూపాయిలో సగం మాత్రమే వుంది. జీతాలు పల్కరించడానికి ఇంకా రెండు రోజులు వ్యవధి వుంది. ముప్ఫయి పైసలు సిటీ బస్‌కి ఇవ్వడం పెద్ద త్యాగంగా కనిపించింది. ఏదయినా అత్యవసర ఖర్చుకి మాత్రమే వినియోగించాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

రెండు కిలో మీటర్ల దూరం భయపెడుతూంది. పగలల్లా శ్రమ పడటంవల్ల నడవటం ఇంకా శ్రమగావుంది. 'ఈవినింగ్ వాక్' యొక్క వుపయోగాలను కొత్తగా గుర్తు తెచ్చుకుని, ఆరోగ్యానికి నడక ఎంత మంచిదోనని ఓదార్చుకున్నాడు శివరావు.

"నడుస్తున్నారేం?" నలుగురైదుగురు పల్కరించారు.

దరిద్రాన్ని దాచేసుకుని మందహాసం చేసి తయారుగా వున్న అబద్ధాలను వల్లించసాగాడు. వెల్‌కం హోటలు రావడంతో మూడు వంతుల ప్రయాణం పూర్తయింది. నడకలో నిస్త్రాణ బయలుదేరింది టిఫిన్ చెయ్యాలని మనస్సు పీకింది చిల్లుజేబు ఫక్కున నవ్వింది ఇంటికి వెళ్ళగానే సుభద్ర కాఫీ ఎలాగూ ఇస్తుంది వృధాఖర్చు అనుకుంటూ కోరికలని జయించి చివరకు ముందుకు నడిచాడు.

ఇంటికి రాగానే వీధి గుమ్మంలోనే ఆగిపోయాడు. లోపలనుంచి బిగ్గరగా నవ్వులు వినవస్తున్నాయి. స్నేహితులు కారు. అతిథి దేముళ్ళు వచ్చారేమోనని గుండె ఝల్లుమంది. గాలిపటం ఎగరవేస్తున్న శేషుని పిలిచాడు. వాడు వచ్చేలోపుగా.

"ఏమిత్రా ఆగిపోయావ్."

జలపాతం మామయ్యని చూడగానే వులిక్కిపడ్డాడు. బెదురుగా అడుగువేసి హీనంగా నవ్వి "ఎప్పుడొచ్చావ్" అని కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమిత్రా అలా ఎండిపోయావ్ . మంచి టానిక్కులు పుచ్చుకోకూడదూ?" జలపాతం దగ్గరగా కూర్చుని కబుర్లు చెబుతున్నాడు.

పదిమైళ్ళు పరుగెత్తిన నీర్సం ఆవరించింది. సుభద్ర మంచి నీళ్ళు తెచ్చిఇచ్చింది. శివరావుకి కాఫీ లేదని అర్ధమై పోయింది. అంతకంటే ముఖ్య విషయం బియ్యం కూడ లేవని ప్రొద్దుట భార్య చెప్పడం గుర్తు వచ్చింది. ఈ పరిస్థితిలో బంధువు రావడం పిడుగు పడినట్లయింది.

జలపాతానికి అరవైవుంటాయి కోర్టు పక్షి. డబ్బున్నవాడే కాని పిసినారి. శివరావు లాంటి మూరపు చుట్టాలని గేలవేసి పట్టుకుంటాడు.

జలపాతం కోర్టుల గురించి అనర్గళంగా వుపన్యాసం యిస్తున్నాడు. శివరావు విసుగ్గా వింటున్నాడు. చుట్టం




ముందు దరిద్రాన్ని రుజువు చేసుకోడానికి మధ్య తరగతి మన స్తత్వం అడ్డువస్తోంది. ఎవర్నయినా చేబదులు అడిగే దశ కూడ దాటిపోయింది. ఆ ముచ్చట మూడవ వారంలో ముగిసింది.

సుభద్ర ఏం చేస్తోందోనని వంటింటి లోకి నడిచాడు. సుభద్ర దిగాలుగా నిల బడివుంది గుమ్మంలో. చుట్టు ప్రక్కల ప్రయత్నించి విఫలమయినట్లు ఆమె ముఖం చెబుతోంది. ఆమెని పలక్కరించ డం వృథా అనిపించింది.

గదిలోకి వెళ్లాడు. హేంగర్ ని చొక్కా మనస్సులో భయంకరమైన వూహ! శివరావు చలించిపోయాడు. నిబ్బ రంగా ముందుకు నడిచాడు.

సరుకులు తెచ్చి ఇచ్చాడు.

"అప్పుచేశారా?" సుభద్ర అడిగింది.

శివరావు మాట్లాడలేదు. భోజనాలు ముగించాకా జలపాతం వుపన్యాసాలు వింటూ నిద్రపోయాడు. శివరావు లేచేసరికి జలపాతం ప్రయాణమయి దగ్గరకివచ్చి "అబ్బాయ్. డబ్బు తక్కువస్తోంది రా?" అన్నాడు అనుమానంగా.

"సరిగ్గా చూశావా?"

"ఆ సాయంత్రం రాగానే లెక్క పెట్టాను రెండు వందల ఇరవై ఉండాలి. రెండువందలే వున్నాయి." నిర్మొఖ మాటంగా చెప్పాడు.

శివరావు మాట్లాడలేదు. తిరిగి జలపా తం "నేను డబ్బు లెక్కపెడుతూంటే శేషుగాడు చూశాడ్రా.... ఒకవేళవాడు..." అన్నాడు.

శివరావు కొడుకుని పిలిచాడు. పన్నాలు గేళ్ళు వాడికి. తొమ్మిది చదువుతున్నాడు. "తాతయ్య డబ్బు తీశావా?" అడిగాడు.

లేదన్నాడు. శివరావు అసహనంగా బెత్తం అందుకున్నాడు. ఎన్ని కొట్టినా అదే సమాధానం. సుభద్ర అడ్డు వచ్చి లాక్కు పోయింది.

"నేను పంపిస్తాలేమావయ్యా. ఎం. ఓ చేస్తా" శివరావు హామీతో జలపాతం కది లాడు. సుభద్ర శేషుని బడికి పంపి "ఎందుకు కొట్టారు వాడ్ని?" అడిగింది.

"నా దొంగతనం చెప్పలేక" శివరావు కళ్ళు మూసుకున్నాడు.

—చెల్లూరి సీతారాజేశ్వరరావు